అసత్యాల కాంగ్రెస్.. అవివేకపు పాలన

- కేసీఆర్ పథకాలను రద్దు చేయడం సిగ్గుచేటు
- ప్రతిపక్షాల గొంతు నొక్కడమే ప్రజాపాలనా?
- ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాం: మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేసీఆర్ పథకాలను రద్దుచేసి కాంగ్రెస్ సర్కార్ తన అవివేకాన్ని బట్టబయలు చేసుకున్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ చెప్తున్నవన్నీ అబద్ధాలేనని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగాల భర్తీ దగ్గరి నుంచి రైతుబంధు సహా అన్ని వర్గాల సంక్షేమం కోసం కేసీఆర్ చేపట్టిన అన్ని పథకాలపై రేవంత్ సర్కార్ దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో 1,61,000 పోస్టులు భర్తీ చేసిందని, వాటిపై ఇంకా అసత్య ప్రచారం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు . కేసీఆర్ ప్రభుత్వం 50 వేల ఉద్యోగాలకు నోటిఫై చేసి, పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసి, ఎన్నికల కోడ్ కారణంగా నియామక పత్రాలు ఇవ్వకుండా ఆగిపోతే అవన్నీ తామే భర్తీ చేసినట్టు చెప్పుకోవటం సిగ్గుచేటని విమర్శించారు. ఏఐసీసీ నుంచి రాష్ట్ర కాంగ్రెస్ దాకా, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ నుంచి మొదలుకొని స్థానిక నాయకత్వాల దాకా వైఫల్యాలనే విజయాలుగా చెప్పుకోవటంకన్నా దుర్మార్గం మరోటి ఉండదన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని గల్లీ నుంచి ఢిల్లీ దాకా డబ్బాలు కొట్టిన నేతలు ప్రభుత్వం ఏర్పాటై 300 రోజులు గడచినా చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు, అన్ని వర్గాలు తిరోగమన దిశలోకి వెళ్లాయన్నారు.

వీటి ఊసేది?

- ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి కనీసం 10శాతం కూడా భర్తీ చేయలేదు.
- 2023 డిసెంబరు 9న రుణమాఫీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన రైతుల్లో సగం మందికిపైగా ఎదురుచూస్తూనే ఉన్నారు.
- ప్రతి నెలా రూ.4,000 పింఛన్ హామీ 11 నెలలైనా అమలు కాలేదు.
- 18 ఏండ్లు పైబడిన మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 అన్నారు. ఇప్పటివరకు ఆచరణ అతీగతీ లేదు.
- ప్రతి విద్యార్థికి రూ.5 లక్షలతో విద్యా భరోసా కార్డు.. ఎక్కడిచ్చారో తెలీదు.
- ప్రతి పంటకు బోనస్ హామీ.. సన్నవడ్లకే పరిమితం.
- కల్యాణలక్ష్మి రూ.లక్షతోపాటు తులం బంగారం ఊసేలేదు.
- మహిళా విద్యార్థులకు ఎలక్ట్రిక్ వాహనాల హామీ ఎటెళ్లిందో గుర్తేలేదు.

ఉన్నవాటిని ఊడ గొట్టారు

కాంగ్రెస్ సర్కార్ కొత్త హామీల అమలు సంగతి పక్కనపెడితే విజయవంతంగా అమలైన పథకాలను ఎత్తగొట్టిందని హరీశ్‌రావు విమర్శించారు. రైతుబంధు, దళితబంధు, బీసీబంధు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు ఇలా అనేక విజయవంతమైన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయటం దుర్మార్గమని మండిపడ్డారు.

ఎన్ని కేసులు పెట్టినా ప్రజల తరఫున కొట్లాడుతం

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కడమే ప్రజాపాలనా? అని హరీశ్‌రావు నిలదీశారు. బీఆర్‌ఎస్ నాయకులకు కేసులు కొత్త కావని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని శనివారం ఎక్స్ వేదికగా స్పష్టంచేశారు. 'మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహా బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. పేదల ఇండ్లు ఎందుకు కూలగొట్టారని ప్రశ్నించినందుకు కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్య. మా నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని హరీశ్ పేర్కొన్నారు.

పేదల భూములు గుంజుకుంటరా?

- జీపీ లే అవుట్ రిజిస్ట్రేషన్ల బంద్ మూర్ఖత్వం
- నాటి కొనుగోళ్లు ఇప్పుడు చెల్లవంటే ఎట్లా?
- కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది నిదర్శనం
- కేసీఆర్ స్కీములపై దుష్ప్రచారం ఆపండి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

జీపీ లే అవుట్లతో పాట్లు కొనడమే తప్పా?

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీ (జీపీ) లే అవుట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తూ ప్రభుత్వం మూర్ఖపు నిర్ణయం తీసుకున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. పేదలు, మధ్య తరగతి ప్రజల గురించి ఆలోచించకుండా ప్రభుత్వం పిచ్చి నిర్ణయాలు తీసుకున్నదని మండిపడ్డారు. జీపీ లే అవుట్లలో గతంలో కొనుగోలు చేసిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు బంద్ చేయటమంటే పేద, మధ్య తరగతి ప్రజల ఆస్తులను ప్రభుత్వం లాక్కోవటమేనని అనుమానం వ్యక్తం చేశారు. పరిపాలన అనుభవం లేకుండా తుగ్లక్‌ను తలపించేలా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. హైడ్రా, మూసీ పేరుతో పేదల గూడు కూల్చేసిన రేవంత్ ప్రభుత్వం తాజాగా హెచ్ఎండీఏ పరిధిలో పేద, మధ్య తరగతివారిని టార్గెట్ చేసిందని మండిపడ్డారు. ఇండ్లు కూల్చింది చాలదన్నట్టు ఇప్పుడు పేదలు, మధ్యతరగతివర్గాల ప్లాట్లపై ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసే కుట్ర జరుగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న జీపీ లే అవుట్లలో వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుక్కోవడమే ప్రజలు చేసిన తప్పా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఎల్ఆర్‌ఎస్ ఉచితంగా చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తుచేశారు. అనేక ఏండ్లుగా ఆ ప్లాట్లు ఎంతో మంది చేతులు మారాయని, ప్రభుత్వం ఇప్పుడు వచ్చి ఆ రిజిస్ట్రేషన్లు చెల్లవు, మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే వాళ్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఉన్న సమస్యలు పరిష్కరించాల్సింది పోయి కొత్త సమస్యలు సృష్టించటమే ప్రభుత్వం పనిగా పెట్టుకున్నదని ధ్వజమెత్తారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో వేలాదిగా జీపీల్లో లే అవుట్లు వెలిశాయని, అవి ఎంతో మంది చేతులు మారాయని వివరించారు. ఇప్పుడు వాటికి ఎవరిని బాధ్యులు చేస్తారని ప్రశ్నించారు. భవిష్యత్తు కోసం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం పైసాపైసా కూడబెట్టుకొని పేదలు, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఇప్పుడు చెల్లవంటే వారి పరిస్థితి ఏమిటని నిలదీశారు. తమ తాతలు, తండ్రులు కొనుగోలు చేసిన ప్లాట్లు చెల్లవని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే వారెవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు.

ఆర్ఆర్ ట్యాక్స్‌తో దోపిడీ..

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే బిల్డర్లను బెదిరిస్తూ ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నదని, ఇప్పుడు వెంచర్ల యాజమానుల నుంచి ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసేందుకే తాజా నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ విమర్శించారు. ఆర్ఆర్ ట్యాక్స్‌తో పేదలు, మధ్యతరగతి ప్రజలను రేవంత్‌రెడ్డి దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఎల్ఆర్‌ఎస్ విషయంలో మాట్లాడిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పుడు నేరుగా ప్రజలు కొనుగోలు చేసిన ఆస్తులు చెల్లవని చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఎల్ఆర్‌ఎస్ ఫ్రీగా చేస్తామంటూ నమ్మబలికి ఎల్ఆర్‌ఎస్ ఫీజు కట్టిన వాళ్లను కూడా ఆగం చేసే పరిస్థితి తెచ్చారని నిప్పులు చెరిగారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని, పంచాయతీ లే అవుట్ల వెంచర్లలో రిజిస్ట్రేషన్లకు అనుమతివ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో బాధితుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

నిర్బంధాన్ని ఎదురిద్దాం

'నిర్బంధాన్ని ఎదిరిద్దాం..ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిద్దాం' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పోలీస్ యాక్ట్ అమలుపై ఆయన ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేండ్లుగా స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్న తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులొచ్చాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామిక తెలంగాణలో మళ్లీ వెనుకటికాలంలా బూటుకాళ్ల శబ్దాలతో తెల్లవారే రోజులొచ్చాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, హక్కులు అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని, పోరాడితే సస్పెన్షన్లు చేస్తున్నారని నిప్పులు చెరిగారు. 'ఇది నియంతృత్వ రాజ్యం..నిర్బంధాన్ని నిర్మిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం. పోరాటం తెలంగాణకు కొత్తకాదు. ఈ మట్టి పొత్తిళ్లలోనే పోరాటం ఉన్నది. నిర్బంధాన్ని ఎదిరిస్తాం. ప్రజాస్వామిక తెలంగాణ పునరుద్ధరణ కోసం పోరాడతాం' అని స్పష్టం చేశారు.

దుష్ప్రచారాన్ని ఆపండి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిన పథకాలను స్కాములని ప్రచారం చేయటం దుర్మార్గమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పంటల దిగుబడిలోనే కాదు..పశు సంపదలోనూ పదేండ్లు పండుగేనని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కుల వృత్తులకు కేసీఆర్ కొండంత అండగా నిలవటం వల్ల పశుసంపదలో రాష్ట్రం గణనీయ వృద్ధి సాధించిందని చెప్పారు. గ్రామీణ తెలంగాణలో ఉపాధి పెంచాలనే తపనలో భాగంగానే సంపద సృష్టిలో అందరినీ భాగస్వామ్యం చేసిన సందర్భాలను గుర్తుచేశారు. రాష్ట్ర డిమాండ్‌కు తగ్గ మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు పెంచే ప్రయత్నం చేశారని, ఇతర రాష్ట్రాలనుంచి నిత్యం వచ్చే వందలాది లారీల దిగుబడికి కేసీఆర్ కళ్లెం వేశారని ఉదహరించారు. కేసీఆర్ ప్రతి ఆలోచన వెనక సుదీర్ఘ అధ్యయనం సాగిందని వివరించారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణ ఫలితంగానే పదేండ్లలో రెండువేల కోట్ల వృద్ధి జరిగిందని కేంద్రం ప్రకటించిన సందర్భాన్ని ఉదహరించారు. కేసీఆర్ అద్భుత స్కీములను స్కాములు అంటూ దుష్ప్రచారం చేసిన దుర్మార్గులు కనీసం ఇప్పుడైనా వారి వైఖరి మార్చుకోవాలని హితవుపలికారు.

హాస్టల్‌లో మంచం మీదపడి విద్యార్థి మృతి

సాత్విక్ (ఫైల్)

జహీరాబాద్, నవంబర్ 2: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని సెవెంత్ డే అడ్వాంటిస్ట్ పాఠశాలలో సాత్విక్ (12) ఐదో తరగతి చదువుతున్నాడు. పాఠశాల మూడో అంతస్తులోని హాస్టల్ రూంలో ఇనుప మంచానికి కట్టిన తాడుతో విద్యార్థులు ఆడుకుంటుండగా మంచంపై కూర్చున్న సాత్విక్ కింద పడిపోయాడు. వెంటనే ఇనుప మంచం సాత్విక్ తలపై బలంగా పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం పట్టణంలోని ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం బాలుడు మృతి చెందాడు. బాలుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా.. వారు దవాఖానకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి స్వస్థలం కర్ణాటకలోని కలబురిగి జిల్లా కుంచారం తాలూకా శివరాంపూర్. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్సై కాశీనాథ్ తెలిపారు. విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

- మృతుల్లో తల్లి, ఇద్దరు పిల్లలు

మనోహరాబాద్, నవంబర్ 2 : మెదక్ జిల్లాలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన మన్నె కుమార్, లావణ్య దంపతులకు సంజన, సహస్ర, శాన్విక ముగ్గురు పిల్లలు. వీరిలో మన్నె లావణ్య (30), ఆమె పిల్లలు సహస్ర (7), శాన్విక (6) సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్‌పల్లిలో బంధువుల ఇంట్లో ఆదివారం జరిగే శుభకార్యానికి శనివారం రాత్రి 7 గంటలకు బయలుదేరారు. లావణ్య బావ మన్నె ఆంజనేయులు (46) తన బైక్‌పై శభాష్‌పల్లి బస్టాప్ వద్ద దించేందుకు వెళ్తుండగా గ్రామ శివారులో రైతులు రోడ్లపై వడ్లు ఆరబోయగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు.

గోరంత పెంపు.. కొండంత కాంగ్రెస్ ప్రచారం

- నాడు సింగరేణి కార్మికులు.. నేడు విద్యార్థులను తప్పుదోవ పట్టించిన సర్కార్
- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): గోరంత చర్యకు..కొండంత ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ సర్కారు తీరుకు అద్దం పడుతున్నదని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. మొన్న సింగరేణి కార్మికులకు బోనస్ విషయంలో, నేడు గురుకుల విద్యార్థుల డైట్ చార్జీల పెంపులో అదే జరిగిందని ఒక ప్రకటనలో ఉదహరించారు. సింగరేణి కార్మికులకు వచ్చిన లాభాల్లో 16.9శాతం బోనస్ చెల్లిస్తే ప్రభుత్వ ప్రకటన మాత్రం 33శాతంగా ఉన్నదని, తాజాగా డైట్ చార్జీలను కేవలం 10శాతం పెంచితే, 40శాతం పెంచినట్టు ప్రచారం చేస్తున్నారని ఆయన వివరించారు. బోగస్ ప్రచారమే కాంగ్రెస్ సర్కారు విధిగా పెట్టుకున్నదని విమర్శించారు. ఏయే తరగతులకు ఎంతెంత మెస్ చార్జీలు ఉండేది? వాటిని సర్కారు ఎంత మేరకు పెంచిందో ఆయన వెల్లడించారు.

తరగతి	ప్రస్తుతం చెల్లిస్తున్నవి	పెంచినవి (రూ)	తేడా(రూ.)
3 నుంచి 7	1200	1330	130
8 నుంచి 10	1400	1540	140
ఇంటర్ నుంచి పీజీ	1875	2100	225

కరెంట్‌పై కాంగ్రెస్ అబద్ధాలు

రాష్ట్రంలో కరెంట్ సరఫరాపై కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నదని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తామని, రైతు సంక్షేమమే తమ ప్రాధాన్యమని కాంగ్రెస్ చెప్పినవన్నీ అసత్యాలని మండిపడ్డారు. 2018 జనవరి 1 నుంచే రైతులకు 24 గంటలపాటు ఉచిత విద్యుత్తు సరఫరాను నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కోతలు లేకుండా కేసీఆర్ తరహాలో 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా కొనసాగిస్తేచాలని ఎక్స్ వేదికగా చురకలంటించారు.

చార్జీల పెంపు ప్రచారం అవాస్తవం: ఆర్టీసీ

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): నిజామాబాద్-హైదరాబాద్ మార్గంలో ఆర్టీసీ బస్సు చార్జీలు పెరిగాయంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని టీజీఎస్‌ఆర్టీసీ శనివారం వివరణ ఇచ్చింది. వాస్తవానికి ఆ రూట్‌లో గరుడ ప్లస్ బస్సు చార్జీ రూ.520గా ఉండేదని, దానిని రాజధాని చార్జీతో సమానంగా రూ.430కి తగ్గించినట్టు తెలిపింది. కొన్ని నెలలుగా ఈ రెండు సర్వీసులకు రూ.430 టికెట్ ధరే ఉన్నదని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సాధారణ చార్జీలనే సంస్థ అమలు చేస్తున్నదని పేర్కొన్నారు.

బీసీలకు అన్యాయం జరిగితే ఉద్యమమే

- కులగణన సర్వేకు చట్టం రూపొందించాలి
- రెండు వేర్వేరు జీవోలతో సర్వేపై గందరగోళం
- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత వీ శ్రీనివాస్‌గౌడ్

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో సాగర్, పల్లె రవికుమార్, కిశోర్, ఆంజనేయులు, విజయ్, నరేశ్

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): బీసీలకు అన్యాయం జరిగితే ఉద్యమం తప్పదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత వీ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కులగణన సర్వేలో కాలయాపన జరిగి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఫలాలు దక్కే విషయంలో అనుమానాలు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కులగణనను ఎక్స్‌రేతో పోల్చుతున్నారని, కానీ తాము ఎంఆర్ఐ అంటున్నామని స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలతో కులగణన సర్వేలో గందరగోళం నెలకొన్నదని విమర్శించారు. డెడికేటెడ్ కమిషన్ వేయాలని హైకోర్టు ఆదేశించినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రణాళిక, బీసీ సంక్షేమ శాఖలు జారీచేసిన వేర్వేరు జీవోలతో అయోమయం నెలకొన్నదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీ కమిషన్ చేపట్టిన సర్వేలో చిత్తశుద్ధి కనిపించడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా కులగణన సర్వేపై న్యాయకోవిదులు, మాజీ న్యాయమూర్తులతో చర్చించాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి సమగ్రంగా చర్చించి చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. బీసీ కమిషన్ జిల్లాల పర్యటనను కలెక్టర్లు పట్టించుకోకపోవడం బాధాకరమని, కమిషన్ సమావేశాలకు రాకుండా అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కులగణన పేరిట సర్కారు మోసం

- చట్టసవరణ లేకుండా సెన్సెస్ ఎలా?
- హైకోర్టు ఆదేశాలు అందలేదని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ చెప్పడం దుర్మార్గం
- రాహుల్ జోక్యం చేసుకోవాలి: దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర జనాభాలో 95 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కులగణన పేరిట రేవంత్ సర్కారు మోసం చేస్తున్నదని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. రాహుల్‌ను అడ్డంపెట్టుకొని రేవంత్ బీసీల గొంతు కోస్తున్నారని విరుచుకుపడ్డారు. చట్ట ప్రకారం సెన్సెస్ చేసే బాధ్యత కేంద్రానిదేనని, ఈ విషయంలో రాష్ట్రాలకు అధికారంలేదని చెప్పారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం ఎంతవరకు కరెక్ట్ అని నిలదీశారు. కులగణనకు సంబంధించి సర్కారు జారీ చేసిన 199 జీవోపై ఎవరైనా కోర్టుకెళ్తే కొట్టేసే ప్రమాదం ఉంటుందని చెప్పారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. క్యాస్ట్ సెన్సెస్‌పై హైకోర్టు ఆదేశాలు అందలేదని బీసీ కమిషన్ చైర్మన్ చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన కమిషన్ రేవంత్ చెప్పుచేతల్లో పనిచేయడం బాధాకరమని పేర్కొన్నారు. డెడికేటెడ్ కమిషన్ వేయాలని రామచందర్‌రావు నేతృత్వంలోని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలు అందలేదని చెప్తున్నవారు ఆ తీర్పునైనా చదువుకోవాలని హితవుపలికారు. కులగణనపై సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే అఖిలపక్షాన్ని పిలవాలని, తమిళనాడు తరహాలో కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న రాష్ట్రానికి వస్తున్న రాహుల్‌గాంధీ స్పందించి బీసీలకు న్యాయం చేయాలని కోరారు.

- **బీసీ కమిషన్ తీరుపై కుల సంఘాల అసహనం**

బీసీ రిజర్వేషన్ల కోటాపై విచారణలో భాగంగా బీసీ కమిషన్ బృందం శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో బీసీ కుల సంఘాల బాధ్యులు కమిషన్‌కు అభిప్రాయాలను లిఖితపూర్వకంగా ఇచ్చారు. జనగామ జిల్లాకు చెందిన ముదిరాజ్ సంఘం నేతలు తమ సమస్యలు వినాలని నినాదాలు చేశారు. - వరంగల్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

బీసీ కుల గణన మీటింగ్ అట్టర్‌ఫ్లాప్

- వేదికపై రెడ్డీలు ఉన్నారని బీసీల బాయ్‌కాట్

కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఖాళీ కుర్చీలు

వికారాబాద్, నవంబర్ 2: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (బీసీ కుల గణన) అంశంపై శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సత్యభారతి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన జిల్లా కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. స్టేజీపైన కూర్చున్న వారిలో చాలా మంది రెడ్డి సామాజికవర్గం వారే ఉండటంతో మిగిలిన వర్గాల వారు మనసు నొచ్చుకుని మధ్యలోనే వెళ్లిపోయారు. ఈ మీటింగ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరగగా.. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. స్టేజీ నిండా నాయకులున్నా.. ముందు ఏర్పాటు చేసిన కుర్చీలు మాత్రం ఖాళీగా దర్శనమిచ్చాయి. కుల గణనకు ఇండ్లు, భూములు, వాహనాలు తదితర వాటి వివరాలను ఇవ్వాల్సిన అవసరం లేదని పలువురు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య, పాల్గొన్న గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, సుధాకర్

బీసీ రిజర్వేషన్లను 50శాతానికి పెంచాలి

- భవిష్యత్ కార్యాచరణపై 5న మేధోమథన సదస్సు
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్/కాచిగూడ, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీల రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో శనివారం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సుధాకర్ ఆధ్వర్యంలో బీసీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతమున్న 12 బీసీ కుల ఫెడరేషన్లను బీసీ కార్పొరేషన్లుగా మార్చాలని పేర్కొన్నారు. రూ.5వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను మంజూరు చేయాలని, సబ్సిడీ రుణం రూ.10లక్షలు ఇవ్వాలని, బీసీ విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. 295 బీసీ కాలేజ్ హాస్టళ్లు, 321 గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి, విద్యాభివృద్ధికి పథకాలను అమలు చేయాలని తెలిపారు. బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా 'బీసీ యాక్టు'ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్యాచరణపై 5న బీసీల మేధోమథన సదస్సును నిర్వహించనున్నట్టు వెల్లడించారు. బీసీ మేధావులు, ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు సత్యం, రాజేందర్, నందగోపాల్, అనంతయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

అటు న్యాస్... ఇటు సర్వే

- కుల గణన విధులపై ప్రైమరీ స్కూల్ టీచర్ల గుర్రు
- పగటి పూట సర్వే చేయడం వీలు కాదంటున్న సంఘాలు
- టీచర్లందరికీ విధులు కేటాయించాలని డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు డిసెంబర్‌లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) పరీక్ష నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా తెలంగాణలో డిసెంబర్‌లో 4న సర్వే జరగనుంది. ఇందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతున్నది. విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబర్చేలా బోధన, నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నది. కానీ ఇంతలో రాష్ట్ర ప్రభుత్వం కుల గణనను తెరపైకి తీసుకొచ్చింది. సర్వే కోసం 3 వారాలపాటు ప్రాథమిక పాఠశాలలను ఒక్క పూట నిర్వహించాలని నిర్ణయించింది. ఓ వైపు న్యాస్‌కు సమయం దగ్గర పడుతున్న వేళ కుల గణన సర్వేకు సమయం కేటాయిస్తే జాతీయ స్థాయిలో రాష్ట్ర విద్యా ప్రమాణాలు దారుణమైన స్థాయిలో పడిపోతాయని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

న్యాస్ సన్నద్ధతకు సర్వే ఆటంకం

మూడేండ్లకోసారి కేంద్ర ప్రభుత్వం న్యాస్ పరీక్ష నిర్వహిస్తుంది.2021లో నిర్వహించిన జాతీయ స్థాయి సర్వేలో తెలంగాణ అట్టడుగున నిలిచింది. కరోనా ప్రభావంతో విద్యాప్రమాణాలు దెబ్బతినడం వల్ల విద్యార్థులు ప్రతిభ కనబర్చలేకపోయారు. మళ్లీ ఇప్పుడు డిసెంబర్ 4న న్యాస్ పరీక్ష జరగనున్నది. ఈ సారి 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సర్వే నిర్వహించనున్నది. విద్యాశాఖ అధికారులు ప్రాక్టీస్ పేపర్లు, మాడల్ పేపర్లు తయారు చేసి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయిస్తున్నారు. మెరుగైన ర్యాంక్‌ను సాధించవచ్చని ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ తరుణంలోనే కుల గణన విధులు వచ్చిపడ్డాయి. మూడు వారాల పాటు ప్రాథమిక బడులు ఒక్క పూటనే నడవనున్నాయి. టీచర్లంతా సర్వేలో నిమగ్నమై ఉండటంతో చదువులు ముందుకు సాగే పరిస్థితుల్లేవు. అంతిమంగా డిసెంబర్‌లో నిర్వహించే న్యాస్ పరీక్షపై ఈ ప్రభావం పడుతుందని ఉపాధ్యాయ సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి.

ఉదయమే సర్వే చేస్తాం

కుల గణన సర్వేకు ప్రైవేటు టీచర్లను ఎందుకు వినియోగించడంలేదు? కేవలం ప్రైమరీ టీచర్లకు విధులు కేటాయించడం సరికాదు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో వెల్లడించిన అభిప్రాయాలకు భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. మధ్యాహ్నం తర్వాత సర్వే చేస్తే ఎలాంటి ఉపయోగం ఉండదు. ఉదయం పూట సర్వేను నిర్వహించేలా ఆదేశాలివ్వాలి.

-హనుమంతరావు, నవాత్ సురేశ్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నేతలు)

బోధనకు ఆటంకం కలగకుండా చూడాలి

కుల గణన విధుల కేటాయింపులో వివక్ష చూపొద్దు. బోధనకు ఆటంకం కలగకుండా చూడాలి. ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదని అంటూనే, మరోవైపు స్కూళ్లను ఒక పూట మూసివేయడం ఎంతవరకు సమంజసం? బదిలీలు, పదోన్నతులు పూర్తయి చదువులు గాడిన పడుతున్న తరుణంలో పీఎస్‌లను మూడు వారాలపాటు ఒకే పూట నడపడంతో విద్యార్థులు నష్టపోతారు.

-మహిపాల్ రెడ్డి, వెంకటేశం (ఎస్టీయూ నేతలు)